


మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 70 | పేజీలు : 8 | వెల : రూ.2/- మంగళవారం 07 ఏప్రిల్ 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2




భూమి నుంచి రికార్డు దూరంలో

1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం

10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

త్వరలో ముసాయిదాపై స్పందిస్తాం : ఇరాన్

హోర్ముజ్‌పై గుత్తాధిపత్య శకం ముగిసిందని స్పష్టీకరణ

ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి

తాజా భీకర దాడుల్లో 34 మందికి పైగా మరణం

అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరపం : ఇరాన్




# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

- పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఏప్రిల్ 06:** రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మిగతా2లో...

# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం

నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి

నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి

గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం

మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం

'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు

మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు



**అనంతపురం,మన జనప్రగతి ఏప్రిల్ 06:** బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. మిగతా2లో...

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

ఆనాటి నేతలు...నేటి మోడీతో మరింత బలోపేతం

47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



**అమరావతి,మన జనప్రగతి ఏప్రిల్ 06:** బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మిగతా2లో...



# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

- అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఏప్రిల్ 06:** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా మిగతా2లో...

# త్వరలోనే మెడికల్ కాలేజీ పూర్తి

అందుబాటులోకి ఆసుపత్రి సేవలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**పల్నాడు,మన జనప్రగతి ఏప్రిల్ 06:** పిడుగురాళ్ల మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి సేవలు ఈ ఏడాది ప్రారంభిస్తామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఈ మెడికల్ కాలేజీ, బోధన ఆసుపత్రి నిర్మాణం నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని మిగతా2లో...

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం

గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు

ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి

పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న



**శ్రీకాకుళం,మన జనప్రగతి ఏప్రిల్ 06:** శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్తుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల మిగతా2లో...

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు

రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్

పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు





# హామీలు నెరవేరుస్తున్నాం

## మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం

- ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం
- ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే : పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ఆదిలాబాద్,మన జనప్రగతి ఏప్రిల్ 06:** రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురా వడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నా మన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం మిగతా2లో...



# తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

- 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు

**చెన్నై,మన జనప్రగతి ఏప్రిల్ 06:** లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -04-2026

# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు.

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్టులలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్త్‌లు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎం.ఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విజయవాడ,మన జనప్రగతి ఏప్రిల్ 06:** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# హామీలు నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

(మొదటి పేజీ తరువాయి)



ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**న్యూయార్క్ ,మన జనప్రగతి ఏప్రిల్ 06:**అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్ల దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

**టెహ్రాన్,మన జనప్రగతి ఏప్రిల్ 06:**పశ్చిమాసియాలో దాదాపు నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించేందుకు ఇరాన్ సుముఖంగా లేదని ఓ సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని ఆయన సోమవారం వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హార్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. కాగా రెండంచెల ముసాయిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరుపక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరగవని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై స్పష్టం చేశారు. ఓ పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయని, వాటిని ఇప్పటికే మధ్యవర్తుల ద్వారా తెలియజేశామని అన్నారు. అయితే ఇవి మితిమీరి ఉన్నాయంటూ అమెరికా పంపిన 15పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ఇప్పటికే తిరస్కరించిందని తెలిపారు. చట్టబద్ధమైన తమ డిమాండ్లను స్పష్టంగా వివరించడంలో ఇరాన్ వెనుకాడబోదని అన్నారు. ఆ విధంగా చేయడాన్ని రాజీ సంకేతంగా భాష్యం చెప్పరాదని అన్నారు. దానికన్నా తమ వైఖరులను నిర్వచించడంలో తమ విశ్వాసాన్ని వ్యక్తీకరించడంగా చూడాలని తెలిపారు. త్వరలో మా స్పందనలు తెలియపరుస్తాం, వివరాలు వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. కాల్పుల విర మణ ప్రణాళికపై ఇరాన్ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా చెప్పారు. కాగా అమెరికా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.పాకిస్తాన్‌విదేశాంగకార్యాలయ ప్రతినిధితాహిర్ అంద్రబి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్ధవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని భావించారని, కానీ రద్దు చేసి చూపించామని అన్నారు. అలాగే, ఎన్డీయే కూటమి కూడా 25 ఏళ్లు పూర్తి చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

## త్వరలోనే మెడికల్ కాలేజీ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. సోమవారం పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీతోపాటు ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రం విడిపోయి పదమూడేళ్లు అయినా.. రాజధాని లేదని దేశమంతా నవ్వుతున్నారని అన్నారు. గత పాలకుల వల్లే మన రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. గత ఐదేళ్ల కాలంలో మూడు ప్రాంతాల పేర్లు చెప్పారని.. ప్రస్తుతం మూడు ఊర్ల పేర్లు చెబుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు ఆ పార్టీ నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఇప్పటికి కూడా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారంటూ ఆ పార్టీ నేతల తీరును ఈ సందర్భంగా ఎండగట్టారు. మార్కాపురం మెడికల్ కాలేజీ కోల్డ్ స్టోరేజ్‌లా ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.


# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 06:–** ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..పి.జి.ఆర్.ఎస్ సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇవ్వడం లేదని, అందువల్ల సంతృప్తి శాతం తగ్గుతోందన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చాలా మంది అధికారులు గడువు ముగిసే చివరి నిమిషంలో (ఉదాహరణకు 100 రోజులు సమయం ఉంటే 90వ రోజున) దరఖాస్తులను చూసి హడావుడిగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇలా చేయకూడదని,ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పిటిషనర్ ఫిర్యాదు అందిన వెంటనే వారితో మాట్లాడాలన్నారు. ఒక సర్వేయర్ 5 మంది పిటిషనర్ల కు సంబంధించి సర్వే చేసినప్పటికీ, సర్వే సర్టిఫికేట్ ఇవ్వనందున అతని ఇంక్రిమెంట్లు కట్ చేయడం జరిగిందన్నారు. పనిలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరిపైనైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఫిర్యాదు పై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**● ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 101 ఫిర్యాదులు: ఎస్పీ విక్రాంత్ పాటిల్.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఏప్రిల్ 06:–**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు.కర్నూల్ కొత్తపేటలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సిఐలు శివ శంకర్, విజయ లక్ష్మీ పాల్గొన్నారు.

# వేంపల్లిలో బైక్ దగ్ధం ఘటన.. ప్రమాదవశాత్తే జరిగినట్లు పోలీసుల స్పష్టం

**వేగంగా నడపడంతో స్కిడ్ అయి మంటలు చెలరేగిన ఘటన**

**పెట్రోల్ లీక్ కారణంగా స్పార్క్ వచ్చి అగ్ని ప్రమాదం**

**ఆసాంఘిక శక్తుల ప్రమేయం లేదని పోలీసుల వివరణ**



**వేంపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 06:–** వేంపల్లి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో చింతరాంపల్లి సమీపంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గండికి వెళ్లే మార్గంలో ఒక పల్సర్ మోటార్ సైకిల్ (AP 39`CH`1934) కాలిపోయిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.ఈ ఘటనపై సోమవారం సాయంత్రం వేంపల్లి సీఐ ప్రకటన విడుదల చేస్తూ పూర్తి వివరాలను వెల్లడించారు.పోలీసుల సమాచారం ప్రకారం, బైక్ యజమాని కమాల్ భాష గండి బైపాస్ రోడ్డులోని ఎమ్ఎమ్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యాడు.రాత్రి సుమారు 2 గంటల సమయంలో అతని స్నేహితుడు మహమ్మద్ అవసరమని చెప్పడంతో బైక్ ఇచ్చినట్లు తెలిపారు.అనంతరం మహమ్మద్ బైక్‌ను వేగంగా నడపడంతో స్కిడ్ అయి పడిపోవడం జరిగింది.ఈ సమయంలో ట్యాంక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో స్పార్క్ ఏర్పడి మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైంది.ఘటన రాత్రివేళ జరగడంతో భయపడిన మహమ్మద్ ఎవరికి చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.దీంతో మంటలను ఆర్పేందుకు ఎవరూ ముందుకు రాలేదు.ఈ ఘటనలో ఎటువంటి ఆసాంఘిక శక్తుల ప్రమేయం లేదని,అనుమానాస్పద అంశాలు లేవని వేంపల్లి సీఐ స్పష్టం చేశారు.

# జలధార అవగాహన సదస్సు

**నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత**

**హెచ్.ఎల్.సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మరియు జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 06:–**పులివెందుల మండలంలోని యర్రబల్లె చెరువు వద్ద నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా జలధార అవగాహన సదస్సునిర్వహించబడింది.సో మవారం తాడిపత్రి నియోజకవర్గంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొని,జల సంరక్షణ మరియు సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యతపై ఇచ్చిన పిలుపు మేరకు పులివెందులలో కూడా ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా చేపట్టారు.తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మరియు పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరులను కాపాడుకోవాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ బిటెక్ రవి పూర్తి మద్దతుగా నిలుస్తూ ఇక్కడి చెరువుల పునరుద్ధరణకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.తాడిపత్రి వేదికగా ముఖ్యమంత్రి గారు వివరించిన విధంగానే ప్రతి సాగునీటి సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించి నీటి వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.బిటెక్ రవి సారథ్యంలో నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, జలధార పథకం ద్వారా భూగర్భ జలమట్టం పెంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పులివెందుల మండల టీడీపీ ఇంచార్జ్ మార్థాల జగన్ మోహన్ రెడ్డి,సీనియర్ నాయకులు మద్దూరు వెంకట్రామిరెడ్డి,పుష్పనాథ్ రెడ్డి, యర్రబల్లె సింగిల్ విండో సోసిటీ ఈశ్వర్ రెడ్డి,లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి,లింగాల మండల సింగిల్ విండో సోసెటి అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,యోగానంద రెడ్డి, జయరామి రెడ్డి,బాబు రెడ్డి, మస్తాన్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సి.ఐ శాంతిలాల్ హెచ్చరిక



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 06:** కడప జిల్లా ఎస్పీ ఆదేశాలు మరియు పులివెందుల డి.ఎస్.పి ఉత్తర్వుల మేరకు పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు సి.ఐ శాంతిలాల్ ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఆయన పలు కీలక సూచనలు చేశారు.కౌన్సిలింగ్ సందర్భంగా ఇన్స్పెక్టర్ శాంతిలాల్ మాట్లాడుతూ చాలామంది ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ సీటులో ప్రయాణికులను లేదా విద్యార్థులను కూర్చోబెట్టుకుంటున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.ఆటో ముందు భాగంలో ఎవరినీ కూర్చోబెట్టరాదని స్పష్టం చేశారు.ప్రతి ఆటో డ్రైవరు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.ఆటోలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని,ప్రతి డ్రైవరు వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ మరియు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులు చెల్లుబాటు అయ్యే విధంగా ఉండాలన్నారు.నిబంధనలను బేఖాతరు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సి.ఐ హెచ్చరించారు.ప్రయాణికుల భద్రత దృష్ట్యా పోలీసు యంత్రాంగం నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుందని, డ్రైవర్లు సహకరించాలని కోరారు.

# బీసీల ఆత్మీయ సదస్సుకు పెద్దఎత్తున తరలిరండి: షణ్ముగం పిలుపు



**పీలేరు మన జనప్రగతి ఏప్రిల్ 06:–**బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19న తిరుపతిలో నిర్వహించనున్న బీసీల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని జాతీయ ప్రధాన కార్యదర్శి పి. షణ్ముగం పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు దక్షిణాది రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.పీలేరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బీసీ సంఘ నాయకులతో సమావేశమై సదస్సుకు హాజరుకావాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, ఉద్యోగాల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్లు, రూ.50 వేల కోట్లతో ప్రత్యేక సబ్‌ప్లాన్, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ వంటి ముఖ్య డిమాండ్లు సాధించడంపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే బీసీ మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యం, జనాభా లెక్కల్లో బీసీ కులాల వివరాలు నమోదు, పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్‌లు, ఆదాయ పరిమితి పెంపు, సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు వంటి అంశాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారని, ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పోలిశెట్టి సురేంద్ర (సాపల సూరి), రమాదేవి, గోళ్ళ కిషోర్ నాయుడు, చంద్రమ్మ, అప్పస్వామి రెడ్డి పాల్గొన్నారు.

# పత్తికొండలో వైయస్సార్ పార్టీ సమావేశం



**పత్తికొండ మన జనప్రగతి ఏప్రిల్ 06:–** పత్తికొండ వైయస్సార్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ నియోజ కవర్గంలో కోర్ కమిటీలు, అనుబంధ విభాగాల నిర్మాణం, డిజిటలైజేషన్ కార్యక్రమాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు.కమిటీ సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో వెరిఫికేషన్ పూర్తి కాలేదని, అధికారిక లింక్ ద్వారా రిజిస్టర్ చేసిన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ నమోదు చేసి, ఫోటో మరియు వివరాలను సరిచూసి వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో కోర్ కమిటీ సభ్యుల వెరిఫికేషన్ బాధ్యతను యూత్ వింగ్, సోషల్ మీడియా సభ్యులకు అప్పగించి, ఈ ప్రక్రియను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. వెరిఫికేషన్ పూర్తిచేసిన వారికి త్వరలో ఐడి కార్డులు అందజేయబడతాయని తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, జడ్పిటిసి సభ్యులు, సర్పంచులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరభద్రుని సన్నిధిలో నిత్య అన్నప్రసాదం

**రాయచోటి మన జన ప్రగతి ఏప్రిల్ 06:–**రాయచోటిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.ఆలయ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్, కార్యనిర్వాహణాధికారి (ఈ.ఓ) డి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ..భక్తులందరూ ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇది ఎంతో ఊరటనిస్తుందని, దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతుందని వెల్లడించారు. భక్తులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నట్లు ఈవో రమణారెడ్డి తెలిపారు .



# ఆకాశవాణి గాయకుల చేత శివప్రసాద్ నాయుడుకు ఘన సన్మానం

**రాయచోటి మన జనప్రగతి ఏప్రిల్ 06:–**పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి సందర్భంగా రాయచోటి పట్టణంలోని భాను హరి రెసిడెన్సీలో అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరియు కోడూరు అబ్జర్వర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు ను ఆకాశవాణి గాయనీ–గాయకులు శాలువా, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులు తుమ్మల హరినాథ్ మాట్లాడుతూ.. అన్నమయ్య వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గాయనీ–గాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారి పాత్ర ప్రశంసనీయమని అన్నారు.శివప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, తాళ్లపాక అన్నమాచార్యుల పేరు మీద జిల్లాకు "అన్నమయ్య జిల్లా"గా నామకరణం జరగడం గర్వకారణమని పేర్కొన్నారు. భక్తి భావంతో అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ ప్రజలు ఐక్యంగా జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆకాశవాణి గాయకులు తుమ్మల హరినాథ్, రెడ్డయ్య రాజు, రాజశేఖర్, తిరుపతి కేశవులు, ప్రభావతి, సుజాత, శివ, గిరిబాబు, కొండా మరి నాగరాజు నాయుడు, జన్నే దామోదర్ నాయుడు, కర్ణ కుమార్ తదితరులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -04-2026

## ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరాలయంలో హైడ్రామా.!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 06:–**అగస్త్యేశ్వర స్వామి ఆలయ వేద పాఠశాల వేదికగా తీవ్ర ఉద్రిక్తత. అధికారులను నిలదీసిన చైర్మన్.అవినీతిపై విచారణకు వచ్చిన అధికారులను ప్రశ్నించిన ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి మరియు కమిటీ సభ్యులు. సస్పెన్షన్ వేటు ఎక్కడ? అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా విచారణలు ఏంటని చైర్మన్ ఆగ్రహం.తప్పు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని అధికారులతో చైర్మన్ వాగ్వాదం. పోలీసు బందోబస్తు మధ్య కొనసాగుతున్న అవినీతి విచారణ. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారంటూ పాలకమండలి సభ్యుల ఆందోళన.చైర్మన్ వర్గీయుల నిలదీతతో వేద పాఠశాల వద్ద నెలకొన్న అశాంతి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## యర్రవారిపాలెంలో ఉమ్మడి భూమి మ్యుటేషన్ వివాదం

### - తహశీల్దార్ కార్యాలయం ఎదుట అన్నదమ్ముల ఆందోళన



**యర్రవారిపాలెం మన జనప్రగతి ఏప్రిల్ 06:–**తిరుపతి జిల్లా,యర్రావారిపాళెం తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. చెంగాడివాళ్లపల్లికి చెందిన ఆరుగురు అన్నదమ్ముల ఉమ్మడి ఆస్తి వ్యవహారం ఇప్పుడు పెద్ద దుమారమే రేపుతోంది. సుమారు 30 ఎకరాల ఉమ్మడి భూమిని, మిగిలిన ఐదుగురు సోదరులకు ఎటువంటి సమాచారం లేకుండానే నాలుగో సోదరుడు తన కుటుంబ సభ్యుల పేరిట మ్యుటేషన్ చేయించుకోవడం వివాదానికి దారితీసింది.తన చదువుకున్న తెలివితేటలతో 10 సర్వే నెంబర్లలోని భూమిని తన భార్య, పిల్లల పేర్లపైకి మార్పించుకున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులు తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగి, ఇతర వారసులకు తెలియకుండా మ్యుటేషన్ ఎలా చేస్తారని అధికారులను నిలదీశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి త్వరలోనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తమ ఆస్తిని తమకు తిరిగి ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

## మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 06:**పులివెందుల పట్టణలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్క రించుకొని శ్రీ మిట్టమ ల్లేశ్వరుని విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుజామున నుం డి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వామివారికి పంచా మృత అ భిషేకం, భస్మాభిషేకం,సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం,లింగాష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయం లో ప్రతిరోజు విశేష పూజలు ధూప,దీప, నైవేద్యాలు,ఘనం గా నిర్వహించడం జరు గుతోందని అన్నారు.సోమవారాన్ని పురస్కరిం చుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమశివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కలు చెల్లించి విశేష పూజలు నిర్వ హించడం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు ఎండో మెంట్ సిబ్బంది ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



## అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

### • అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:–** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారుసోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వారి తో పాటు జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డి ఆర్ ఓ మల్లికార్జున వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు.ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు..అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ సుబ్రమణ్యం,డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి,ఇన్చార్జి డిపిఓ వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మురారిచింతలలో పోలీస్ గ్రామసభ నిర్వహణ

### • విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

### • అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు • ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి హెచ్చరిక




**లింగాల మన జనప్రగతి ఏప్రిల్ 06:–** మండల పరిధిలోని మురారిచింతల గ్రామంలో ఆదివారం రాత్రి లింగాల పోలీసులు గ్రామసభను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాత్రి వేళల్లో గ్రామాలను సందర్శిస్తూ, ప్రస్తుతం జరుగుతున్న నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నామని పేర్కొన్నారు.పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే సైబర్ క్రైమ్, భూ వివాదాలు,మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు,చీటింగ్,సోషల్ మీడియా దుర్వినియోగం, పోక్సో కేసుల వంటి అంశాలపై గ్రామస్తులకు వివరించారు. నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, ఎవరైనా గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ పర్యవేక్షణలో జరిగింది. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటానికి అందరూ కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ సూచించారు.ఈ గ్రామసభలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మదనపల్లిలో జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి: సిఐటియు పిలుపు



**పీలేరు మన జనప్రగతి ఏప్రిల్ 06:–** అన్నమయ్య జిల్లా,ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండో మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు.పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో యూనియన్ అధ్యక్షుడు బీవీ రమణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక సమస్యలపై కీలకంగా మాట్లాడారు.వెంకట్రామయ్య మాట్లాడుతూ..పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు అవసరమని, సిఐటియు ఆధ్వర్యంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.జిల్లాలో పారిశుద్ధ కార్మికులు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు రావాల్సిన ప్రాథమిక సౌకర్యాలు, భద్రతా చర్యలు అమలు కావడం లేదని, ముఖ్యంగా పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కొన్ని పంచాయతీల్లో కార్మికుల నుండి సంవత్సరాలుగా పీఎఫ్ నిధులు వసూలు చేసి దుర్వినియోగం చేసిన ఘటనలు ఉన్నాయని తెలిపారు.ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్,జిల్లా డిపిఓలకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి పరిష్కారం కనిపించలేదని విమర్శించారు. అధికారులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే అందరూ ఐక్యంగా నిలబడి చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీన మదనపల్లి ఎన్‌జీఓ కార్యాలయం సమీపంలో జరగనున్న అన్నమయ్య జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పులి రెడ్డప్ప, పీలేరు యూనియన్ కోశాధికారి బి. నాగార్జున, రమేష్, చిట్టెమ్మ, రాజేశ్వరి, భాస్కర్ ప్రతాప్ రెడ్డి, వైయస్ మస్తాన్, శ్యామల, సరోజ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులు భారీ సంఖ్యలో హాజరై మహాసభలకు మద్దతు తెలిపారు.

## అధిక ఉష్ణోగ్రతలతో అప్రమత్తం: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:–** అధిక ఉష్ణోగ్రతలు మరియు వేడి గాలుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండితమఆరోగ్యాన్నికాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు.సోమవారం జిల్లా సచివాలయం లోని సభా భవన్ నందు కలెక్టర్, జేసి డా.నిధి మీనా తో కలసి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వేడి గాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బ నుండి రక్షణ పొందేందుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా నీరు,పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే కార్మికులు,డ్రైవర్లు వంటి వారు టోపీలు ధరించడం ద్వారా తమను రక్షించు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ మల్లికార్జునుడు, ఇంచార్జ్ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ ప్రవీణ్ , డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ హిమ దేవి ఆర్.బి.ఎస్.కే మరియు ఎన్.సి.డి ఆఫీసర్ డాక్టర్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలి: జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:–** జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 114 ఫిర్యాదులు PGRS కు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.ఎస్పీ పేర్కొన్న ముఖ్య అంశాలు పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం.ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్.పి నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్ ) కె. ప్రకాష్ బాబు , మహిళా పి.ఎస్ డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి పాల్గొన్నారు.

## ఒక లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం: కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:–**ఒక లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని కమలాపురం శాసనసభ్యులు పుత్త కృష్ణచైతన్య రెడ్డి తెలిపారు. కడప నగరం బిల్డప్ సర్కిల్ నందు తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంస పాలనను సరిచేస్తూ రాష్ట్రాన్ని ఒక క్రమ పద్ధతిగా అభివృద్ధి పరుస్తున్నామని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించామన్నారు. అమరావతి పనులను ఐఐటి మెడ్రాస్ వారి ద్వారా నాణ్యతను పరిశీలన చేసి పనులు మొదలు పెడుతున్నామన్నారు. 2027 కు పనులను పూర్తి చేస్తామన్నారు. అమరావతి ప్రాంతంలో వివిధ బ్యాంకులకు యూనివర్సిటీలకు కావాల్సిన స్థలాలను ఇచ్చామన్నారు అభివృద్ధి పలాలు అందరికీ చెందేలా రాష్ట్రాన్ని నలుమూలల అభివృద్ధి పథంలో చంద్రబాబు నడిపిస్తున్నారు. మేము వస్తే అమరావతి తీసేస్తాం అనడం అభివృద్ధిని అడ్డుకోవడమే తప్ప ప్రజల మేలు కోసం కాదని దానివల్ల రాక్షస ఆనందం తప్ప మరేమీ లేదన్నారు. కమలాపురం ఆర్ఓబి టెండర్ పనులను 2019 మార్చి నెలలో తెలుగుదేశం సమయంలోనే బీసీ జనార్ధన్ రెడ్డి కష్టపడి తెప్పించారన్నారు వైసీపీ చేయలేని ఎన్నో పనులను చేస్తున్నాము చెరువులకు నీళ్లు నింపుతున్నాం జి ఎన్ ఎస్ ఎస్ పనులు చేస్తున్నాము, రోడ్లు వంతెనలను నిర్మిస్తున్నాం. కొప్పర్తి పనులను కొనసాగిస్తున్నాము .టెక్నాలజీ సెంటర్ ను కడప లోనే కొనసాగిస్తూ తొందర్లోనే ముఖ్యమంత్రి చేత శంకుస్థాపన చేపిస్తాము ప్రజలు అన్ని గమనిస్తున్నారు. ఎవరు అభివృద్ధి చేశారు. ఎవరు విధ్వంసం చేశారని కాబట్టి ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని కాంక్షించి కూటమి ప్రభుత్వానికి సపోర్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జయ సుబ్బారెడ్డి, గంగిరెడ్డి ,భాస్కర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, శివారెడ్డి ,జనార్దన్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కోట్ల రూపాయల అవినీతి పై విచారణ చేయాలి

**● ఏ.ఐ.బి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు జగన్ నాయక్**




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:-** సోమవారం కడప కలెక్టరేట్ వద్ద ఏఐ బి ఎస్ యు ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఓపెన్ స్కూల్, ఇంటర్ విద్యార్థుల పరీక్షల సమయం లో కాపీ లు జరిపించేందుకు ఒక్కో విద్యార్థి నుండి 5 వేల రూపాయలు వసూలు చేశారు. దీనికి జిల్లాలోని అక్కడి సెంటర్స్ నిర్వాహకులు కీలక పాత్ర పోషించారు. వారి ద్వారా కో ఆర్డినేటర్ వసూలు చేసుకున్నందన్నారు. దీనికి పరీక్షలు రాసిన విద్యార్థుల్ ప్రత్యేక్ష సాక్షులు అన్నారు. ఇలా వసూలు చేసిన కోట్ల రూపాయలు, విద్యాశాఖ అధికారులు పంచుకున్నరన్నారు. కో ఆర్డినేటర్ పోస్టులో అవినీతికి ఆస్కారం ఎక్కువని కో ఆర్డినేటర్ గా వున్నా సాంబ శివారెడ్డి, అర్హతలు లేకున్నా పైరవీలు చేసుకొని కో ఆర్డినేటర్ గా వచ్చాడాన్నారు. ఆయన అర్హతల పైన కూడా విచారణ చేయాలనీ, మొత్తం గా కోట్ల రూపాయలు చేతులు మారిన వ్యవహారం పై విచారణ జరిపించి విచారణ చేయాలని, అందుకు జిల్లా కలెక్టర్ గారు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, జయరాజు, నిఖిల్, అభిలాష్, నాగిరెడ్డి, మల్లేష్, రామూర్తి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు

## పెన్నా నది వద్దకు వచ్చే పర్యాటకులకు హృదయపూర్వక విజ్ఞప్తి: వల్లూరు ఎస్ఐ శివ నాగిరెడ్డి



**చెన్నూరు మన జనప్రగతి ఏప్రిల్ 06:-**పెన్నా నది అందం చూసేందుకు,షార్ట్ ఫిలిమ్స్ చిత్రీకరణ కోసం, సరదా విహారయాత్రల కోసం ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ ఒక విషయం గుర్తుంచుకోవాలని వల్లూరు ఎస్ ఐ.శివనాగిరెడ్డికోరారు.సోమవారం విలేఖర్లతోమాట్లడుతుపన్నానది బయటకు కనిపించే అందం ఎంత మోహింపుగా ఉన్నా, లోపల అంతే ప్రమాదకరంగా ఉంటుంది.ఇక్కడ అనేక ప్రదేశాల్లో సుడిగుండాలు ఉన్నాయి. అవి కంటికి కనిపించకపోయినా,ఒక్కసారి లోపలికి లాగితే బయటపడటం చాలా కష్టం. నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి వెళ్లడం అనేది మీ ప్రాణాలతో ఆడుకోవడమే. ముఖ్యంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో నదిలోకి దిగడం అంటే ప్రమాదాన్ని ఆహ్వానించడమే.ఈ రోజుల్లో ఒక ఫోటో కోసం, ఒక వీడియో కోసం, ఒక షార్ట్ ఫిలిం కోసం మనం చేసే చిన్న నిర్లక్ష్యం.మన జీవితాన్ని మాత్రమే కాదు, మన కుటుంబం జీవితాన్ని కూడా శాశ్వతంగా మార్చేస్తుంది.ఒక్కసారి ఆలోచించండిడమీ కోసం ఎదురు చూస్తున్న అమ్మానాన్నలు, మీపై ఆధారపడిన కుటుంబ సభ్యులు, మీతో నవ్విన స్నేహితులు మీ ఒక్క నిర్ణయంతో వారు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి రాకూడదు.సరదా కోసం వెళ్లిడ బాధను మిగల్చొద్దు.ఆనందం కోసం వెళ్లి విషాదాన్ని తీసుకురావొద్దు.జీవితం చాలా విలువైనది. ఒక క్షణం జాగ్రత్త జీవితాంతం ఆనందాన్ని ఇస్తుంది. ఒక క్షణం నిర్లక్ష్యండ జీవితాంతం బాధను మిగులుస్తుంది. దయచేసి జాగ్రత్తగా ఉండండిమీరు సురక్షితంగా ఇంటికి చేరుకోవడం.. అదే మీ కుటుంబానికి నిజమైన ఆనందం.మీ జాగ్రత్తేడమీ కుటుంబానికి రక్షణప్రాణం కంటే విలువైనది మరొకటి లేదు.

## రైతులు,ఎస్టేట్ అధికారులపై బ్లాక్ మెయిల్ చేస్తున్న మాకిరెడ్డిని అరెస్టు చేయాలి




**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 06:-**కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం అఖిల భారత రైతు - కూలి సంఘం (ఏఐకేఎంఎస్) భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల రైతు బజార్ రైతులు, వినియోగదారులు ధర్నా చేశారు. రైతు బజారును పరిరక్షించాలని, 200 మంది రైతుల ఉపాధిని కాపాడాలని,వినియోగదారుల సంక్షేమాన్ని పరిరక్షించాలని, రైతు బజార్ స్థలాన్ని ఆక్రమించిన మాకిరెడ్డి భాస్కర్ గణేష్, తదితరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బజార్ స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా చేశారు.ఈ ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 93 కులాల బీసీ ఐక్యవేదిక పేరుతో మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, రైతుల పైన, రైతు బజార్ అధికారుల పైన తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారని విమర్శించారు. మాకిరెడ్డి భాస్కర్ గణేష్ తదితరులు రైతు బజార్ స్థలాన్ని ఆక్రమించి రైతుబజారుపైనే తప్పుడు ఆరోపణలు సాగిస్తున్నారని విమర్శించారు. 2014లో మాకిరెడ్డి భాస్కర్ గణేష్ ఎస్టేట్ అధికారులను ఆఫీసులో నిర్బంధించి తాళం వేసాడని, ఆ చర్య కారణంగా భాస్కర్ గణేష్ కు గౌరవ కోర్టు వారు ఫైన్ వేసారని, ఆ తర్వాత రైతులపై సాగించిన దౌర్జన్యాలకు టూ టౌన్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, క్షమాపణ కోరడంతో వదిలిపెట్టారని వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. రైతు బజార్ ను ఆనుకొని ఉన్న తన స్థలానికి డిమాండ్ పెంచుకోవడానికి రైతు బజార్పై తప్పుడు ఆరోపణలు చేసి, దాన్ని ఇక్కడి నుంచి లేపేయడానికి కుట్రలు సాగిస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు జి బాలరాజు, ఐఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి జి ఆదినారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ రాఘవులు, రైతు నాయకులు కే కనకారావు, కె వీర్రాజు, ఏళ్ల సత్తిబాబు, కూరాకుల కొండరాజు, బొజ్జ మాణిక్యం, పుల్లా రాఘవ, కర్రి ముత్తా రావు, షేక్ అమీనా బిబి తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

## పులివెందులలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**పులివెందుల మన జనప్రగతి ఏప్రిల్ 06:-** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పులివెందుల నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు బూత్ స్థాయిలలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా జరిగాయి.పులివెందుల మండల అధ్యక్షులు వై. నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ దేశ సేవలో, ప్రజల సంక్షేమంలో ఎప్పుడూ ముందుంటుందని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్ మాట్లాడుతూ, పార్టీ స్థాపన దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, ఎస్సీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు కోడి మూర్తి శ్రీరాములు, లక్ష్మయ్య, విజయలక్ష్మి తదితరులు మరియు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 8న చెన్నూర్‌లో సద్గురు పూజ్య శ్రీ రామదాసు స్వామి 16వ సంస్కరణ దినోత్సవం





**చెన్నూరు మనజనప్రగతి ఏప్రిల్ 06:-**చెన్నూరులో శ్రీ రామాలయ నిర్మాణం. రాధా కృష్ణ భజన మందిరం. ఉపన్యాస వేదిక నిర్మాణం. శ్రీ శ్రీ శ్రీ స్వర్గీయ రామదాసు స్వామి కృషి ఫలితంగా గ్రామస్తులు సహకారంతో నిర్మించిన విషయం తెలిసిందే. ఇక్కడ జరిగే ప్రతి ఉత్సవాలకు రామదాసు స్వామి హాజరయ్యేవారు.4-4-2010 పదవ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన ధామ ము లో శివైక్యం చెందినారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం రామదాసు స్వామి సంస్కరణ దినోత్సవం జరుపుతున్నారు. రామదాసు స్వామి వారి 16వ సంస్కరణ దినోత్సవం బుధవారం నిర్వహించేందుకు చెన్నూరు శ్రీ సీతారామనామ సంకీర్తన క్షేత్రంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాధాకృష్ణ భజన మందిరంలో ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీ హనుమత్ అభిషేకం అర్చకులు చేతులు మీదుగా నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు హనుమాన్ చాలీసా. సంకీర్తన నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముఖ్య అతిథుల ఉపన్యాసాలు. 12 గంటల నుంచి ఒంటిగంట వరకు భోజన ప్రసాద వితరణ. మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు భగన్నామ సంకీర్తన నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ స్వామి వెంకటరమణ చిన్మయ మిషన్ కడప పూజ శ్రీ శ్రీ రామదాసు స్వామి శిష్యులు మాధవస్వామి చెన్నూరు గారిచే సంకీర్తన. పలువురు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

## బెలుగుప్పలో మిన్నంటిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు

**● మన ఊరు మన జెండా' కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరణ ● దేశాభివృద్ధికి, అంత్యోదయ సాధనకు కార్యకర్తలు పునరంకితం కావాలి: దగ్గుపాటి సౌభాగ్య**



**బెలుగుప్ప మన జనప్రగతి ఏప్రిల్ 06:-** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా బెలుగుప్ప టౌన్‌లో శనివారం వేడుకలు ఘనంగా జరిగాయి. 1980 ఏప్రిల్ 6న పార్టీ ఆవిర్భవించిన చారిత్రాత్మక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ, "మన ఊరు మన జెండా" కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు బెలుగుప్ప కేంద్రంలో కాషాయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మరియు బెలుగుప్ప మండల ఇంచార్జ్ దగ్గుపాటి సౌభాగ్య మాట్లాడుతూ, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయమైన 'ఏకాత్మ మానవతావాదం' మరియు 'అంత్యోదయ' లక్ష్యాలతో బీజేపీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే పార్టీ అంతిమ లక్ష్యమని ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో బెళుగుప్ప మండల అధ్యక్షుడు పూజారి మధు, సీనియర్ నాయకులు కె. రామాంజనేయులు, దగ్గుపాటి శ్రీరాములు, కె. గోపాల్ పాల్గొన్నారు. అలాగే జిల్లా మహిళా మోర్చా నుండి కార్యవర్గ సభ్యురాలు భవాని, నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## వైసీపీ చెత్త పాలనతో రాష్ట్రం అధోగతి: మంత్రి నారాయణ

**● 10 లక్షల కోట్ల అప్పు..153 లక్షల టన్నుల చెత్త. ● గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ నిప్పులు ● చిత్తూరుకు అభివృద్ధి కళ-వందల కోట్ల నిధులతో మంత్రి నారాయణ మాస్టర్ ప్లాన్. ● చిత్తూరు కార్పొరేషన్‌లో మంత్రి నారాయణ సమీక్ష,అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ● మే నెల లోపు క్లీన్ ఏపీ -ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ● రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎల్ఈడీ లైట్లు. ● డ్రైనేజీ వ్యవస్థకు 5000 కోట్లు**




**నెల్లూరు మన జనప్రగతి ఏప్రిల్ 06:-** గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసి, అస్తవ్యస్త పాలనతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజావసరాలను పట్టించుకోకుండా రాష్ట్రంపై 10 లక్షల కోట్ల అప్పు భారం వేయడమే కాకుండా, పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయేలా చేశారని ధ్వజమెత్తారు.డంపింగ్ యార్డ్ ,టిడ్కో ఇళ్ళ సముదాయాన్ని ,రోడ్లను మంత్రి పరిశీలించారు.చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిచారు .అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో రాష్ట్రానికి మళ్ళీ మంచి రోజులు రాబోతున్నాయన్నారు.చిత్తూరు నగరాభివృద్ధి కోసం అమృత్ పథకం కింద 29.7 కోట్లు, అర్బన్ ఇన్ఫ్రా కోసం 53.24 కోట్లు,82 కోట్లతో కచ్చా డ్రైన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మే నెల లోపు రాష్ట్రంలోని చెత్తను శుభ్రం చేస్తామని, 14,000 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్లాన్ అప్రూవల్స్‌లో జాప్యం వద్దని అధికారులను ఆదేశిస్తూ, ప్రజా సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్ ,మురళీ మోహన్ ,కలెక్టర్ సంపత్ కుమార్, కార్పొరేషన్ కమీషనర్ నరసింహ ప్రసాద్,చుడా చైర్పర్సన్ కటారి హేమలత .మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ,చుడా విభాగాధిపతులు, టీడీపీ ముఖ్యనేతలు తదితరులు పాల్గొన్నారు

## అఖిల గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 06:-** స్థానిక పాత బస్టాండ్ రిజిస్టార్ కార్యాలయం బయట అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవిచలివేంద్రం ఉచిత త్రాగునీరు కేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణి చేసిన మాజీ యంపిపి నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పట్నం లక్ష్మణ్, గాండ్ల సంఘం అధ్యక్షుడు నల్లం శివశంకర్, టిడిపి రాజుపాలెం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి కమిటి సభ్యులు చిన్నసుబ్బయ్య నాగభూషణం తులాశయ్య వరప్రసాద్ నాగయ్య చిన్నపుల్లయ్య రమణ అంజి ఇతర నాయకులు పాల్గొన్నారు.ద

## వైజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**సింహాద్రిపురం మన జనప్రగతి ఏప్రిల్ 06:** మండలంలోని నంద్యాల పల్లెకు చెందిన వైజీఆర్ ట్రస్ట్ చైర్మన్ వై.శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం విశ్రాంత ఉపాధ్యాయురాలు,దివంగత వై.వి.సుబ్బమ్మ మూడవ వర్ధంతి పురస్కరించుకొని మంగపట్నంలోని అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దివంగత సుబ్బమ్మ జ్ఞాపకార్థం ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహించనున్నారు అని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైజీఆర్ ట్రస్ట్ సభ్యుడు వై.హరినాథ్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సేవామూర్తులకు సత్కారం అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ కార్యక్రమం




**పీలేరు మన జనప్రగతి ఏప్రిల్ 06:-**సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12, 2026న విశిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సరోజమ్మ ఒక ప్రకటనలో తెలిపారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా, ఆంధ్ర డొక్కా సీతమ్మ, అన్నపూర్ణాదేవిగా ప్రఖ్యాతి గాంచిన సౌందర్య వీరి పేర్లపై "స్వర్ణ నంది" మరియు "జాతీయ వికాస" పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.జానపద కళాకారులు, నాయకులు, సమాజ సేవకులు,టీవీ యాంకర్లు, కళాకారులు మరియు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వ్యక్తులను ఎంపిక చేసి ఈ ఐకాసా అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు.అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ సరోజమ్మ కోరారు. ముందస్తుగా నమోదు చేసుకున్న వారికే అవకాశం కల్పించబడుతుందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో ఏప్రిల్ 12న మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.మరికొన్ని వివరాలకు 6302908528 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ సరోజమ్మ మాట్లాడుతూ, సమాజానికి సేవ చేసే వ్యక్తులను ప్రోత్సహించడం సంస్థ ప్రధాన ఉద్దేశమని,భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

## ఇస్నాపూర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

- కాషాయ కేతనం ఎగిసింది
- పార్టీ జెండా ఆవిష్కరణ, స్థానిక నాయకులు




**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 06:–** ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి ఘనంగా ఎగరవేశారు. దేశాభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో బీజేపీ పాత్రను నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కవాలి వీరేశం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు, సంజీవ్ కుమార్ ఇస్నాపూర్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు, బాలూ యాదవ్ పటాన్‌చెరు మండల యువమోర్చా అధ్యక్షుడు, రాము, నాగరాజు, అల్లం రాజ్ రెడ్డి, సుధాకర్, రవి, ముత్యం, శివప్రసాద్, రాజ్, గోపాల్ , దినేష్, మల్లేష్ పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం కార్యకర్తలు నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా ఒక బీజేపీ కార్యకర్తకు సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరికీ బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## బోయకొండ అటవీ ప్రాంతంలో తమిళనాడు వాసి దారుణ హత్య



**చౌడేపల్లి మన జనప్రగతి ఏప్రిల్ 06:–** బోయకొండ అటవీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున ఒక అమానుష ఘటన వెలుగుచూసింది. తమిళనాడుకు చెందిన గాంధీ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. తండ్రిని చంపేస్తుంటే కళ్లారా చూసిన ఐదేళ్ల కుమారుడు సందీప్, రాత్రంతా తండ్రి శవం పక్కనే అడవిలో గడిపాడు. ఉదయం 1.5 కిలోమీటర్లు ఒంటరిగా నడుచుకుంటూ వచ్చి సమీపంలోని అంగన్‌వాడీ టీచర్‌కు విషయం చెప్పాడు. టీచర్ అడవిలోకి వెళ్లి చూడగా గాంధీ శవమై పడి ఉన్నాడు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం అందించారు. అక్రమ సంబంధం కారణంగానే నరసింహులు అనే వ్యక్తి మరో ముగ్గురితో కలిసి గాంధీని హత్య చేసినట్లు తెలుస్తోంది. మృతుడి భార్య రాఫాతి ప్రస్తుతం పరారీలో ఉంది. పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఐదేళ్ల బాలుడి ధైర్యం, పడ్డ వేదన స్థానికులను కన్నీరు పెట్టించింది.

## మెషిన్ లెర్నింగ్‌తో అవకాశాలు మెండు



**కడప మనజనప్రగతి ఏప్రిల్ 06:–** మెషిన్ లెర్నింగ్ తో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని కె ఎస్ ఆర్ ఎమ్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ సహాయ ఆచార్యులు ఎం.ప్రసాద్ రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ శాఖ విద్యార్థులకు నిర్వహించే "మిషన్ లెర్నింగ్ "పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. సోమవారం ఆయన మెషిన్ లెర్నింగ్ భావనలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులు ఎలా సన్నద్ధంగా ఉండాలో తెలిపారు. భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్,మిషన్ లెర్నింగ్ అంశాల చుట్టూ తిరుగుతుంది అన్నారు. మిషన్ లర్నింగ్ భావనలను వాటి అనువర్తనాలను ప్రాథమికంగా నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. వివిధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమస్యలను పరిష్కరించడానికి తర్కాన్ని అన్వేషించాలని,మెషిన్ లెర్నింగ్ ప్రయోగాలను రూపొందించాలన్నారు. మూడు రోజుల శిక్షణ తరగతుల్లో శ్రద్ధగా దృష్టి సారించాలని సూచించారు. ఎంబీఏ శాఖ విభాగాధిపతి డా.పి.సరిత మాట్లాడుతూ మేనేజ్మెంట్ విద్యార్థులకు మిషన్ లెర్నింగ్ లో పరిజ్ఞానం లభిస్తే అవకాశాలకు మార్గమం మరింత దగ్గరవుతుందన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం: ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

- ఘనంగా బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం



**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 06:–** దేశంలో అభివృద్ధి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ద్వారానే సాధ్యమవుతుందని ఆ పార్టీకి చెందిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళుతున్న ఘనత బీజేపీకే ఉందని ఆయన చెప్పారు. సోమవారం కాకినాడ– సామర్లకోట రోడ్డులోని జిఎస్సార్ నగర్లో బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి తర్వాత భారతమాత విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..ప్రధానమంత్రి మోదీ ప్రజా రంజక పాలన అందిస్తున్నార న్నారు. మోడీ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు. జాతీయ రహదారులు కోట్లు విమానాశ్రయాలు ఎన్నో భారీ స్థాయిలో నిర్మించినట్లు పేర్కొన్నారు. పార్టీ ఆదేశా లతో జిల్లాలో ఆవిర్భావ కార్యక్రమాన్ని ఈ జిఎస్ఆర్ నగర్లో ఏర్పాటు చేసినట్లు రామకృష్ణారెడ్డి చెప్పారు. భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన గీసాల శ్రీనివాసరావును బీజేపీ నాయకులు అభినందిం చారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షుడు గీసాల శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ వాసంశెట్టి సత్యవేణి, నాయకులు కుండల సాయికు మార్, శంకర్ సింగ్, గోడి సత్యవతి, గోడి వెంకట్, సదనాని కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మదరసా,మసీదును కాపాడండి: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి ముస్లిం నాయకుల విన్నపం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 06:**పులివెందుల నియోజకవర్గంలోని వేల్పుల గ్రామ సమీపంలో ఉన్న మదరసా మరియు మసీదును గ్రీన్ ఫీల్డ్ హైవే విస్తరణ నుండి కాపాడాలని కోరుతూ ముస్లిం మైనార్టీ నాయకులు సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రహదారికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఆయనకు అందజేసి,పరిస్థితిని వివరించారు. అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ,ధార్మిక విద్యను అందిస్తున్న దారుల్ ఉలూమ్ మదరసాను గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల నిమిత్తం ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడంపై మైనార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ–బెంగుళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే అనుబంధ రింగ్ రోడ్డు కారణంగా మదరసా ట్రస్టు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని,దీనిపై ఇప్పటికే కోర్టులో వాదోపవాదాలు జరుగుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. మదరసా మరియు మసీదు నిర్మాణాలు రహదారి పనుల్లో పూర్తిగా పోకుండా రూట్ మ్యాప్‌లో మార్పులు చేయాలని,కేంద్ర మంత్రులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ముస్లిం నాయకుల విన్నపంపై ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి,మదరసా మరియు మసీదుకు వీలైనంత వరకు నష్టం జరగకుండా వాటిని కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ ధర్మకర్త అబ్దుల్లా మౌలానా,జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, ఫాతిమా మసీదు ధర్మకర్త హమీద్,ఎలక్ట్రికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబహాన్,రఫిక్, షఫీ సాబ్, హిదాయాత్,బాబు పీరా, అమీర్ సాబ్,పలువురు ఇమాములు,లేత్ మిషన్ భాష తదితరులు పాల్గొన్నారు

## తహశీల్దారు మోహన్ కృష్ణకు డీలర్లు సత్కారం



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 06:**వేంపల్లె మండలానికి నూతనంగా విచ్చేసిన తాహసిల్దారు మోహన్ కృష్ణకు వేంపల్లె మండల డీలర్లు సంఘం సత్కరం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తాహసిల్దారు మోహన్ కృష్ణను టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో పౌరసరఫరాల రాష్ట్ర కమిటీ సభ్యుడు సింగారెడ్డి నాగిరెడ్డి, మైనార్టీ సహయ కార్యదర్శి సైపుల్లా, ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్యలు మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే డీలర్లు సంఘం తరుపున వారు తాహసిల్దారు మోహన్ కృష్ణను శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్ లు కూడ తాహసిల్దారును కలిసి శాలువతో సత్కరించారు. ప్రజలకు, రైతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారు మోహన్ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని ప్రజలకు సకాలంలో సరఫరా చేయాలని కోరారు. ప్రజలకు సేవా చేయడం అనేది డీలర్లుకు వరం అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే ప్రతి నిత్యావసర వస్తువులను ప్రజలకు చేరవేసినప్పుడే వారి మన్ననలు పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అందరి సహకరంతో ప్రజలకు, రైతులకు ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు సహకారం కూడ తనకు ఉండాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. తనను అభిమానంతో సత్కరించినందుకు ప్రతి రేషన్ డీలరుకు, పార్టీ నాయకులకు అభినందనలు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, మడక శ్రీను, డక్కా రమేష్, దేరంగుల బాబు, రాజా నాయక్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు

## సింహాద్రిపురంలో ఘనంగా బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం





**సింహాద్రిపురం మన జనప్రగతి ఏప్రిల్ 6:**భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సింహాద్రిపురం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి మరియు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం శశిభూషణ్ రెడ్డి మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన బీజేపీ దేశ సేవను పరమోద్దేశంగా పెట్టుకుని ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు. సబ్కా సాథ్ సబ్కా వికాస్ నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం సమగ్ర అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. అటల్ బిహారీ వాజపేయి మార్గదర్శకత్వం నుండి నేటి మోదీ నాయకత్వం వరకు పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందని ఆయన పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు,కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో మన ఊరు – మన జెండా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జెండాను ఎగురవేసి గర్వంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కడప జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి,ఓబీసీ మోర్చా రామాంజనేయులు,మహిళా మోర్చా గురు రవళి పాల్గొన్నారు. అలాగే కిసాన్ ఇన్చార్జ్ సునీల్ దత్తాత్రేయ, యువమోర్చా రాంప్రకాష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ద్వారకనాథరెడ్డి,సీనియర్ నాయకులు జానకిరామ్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్చార్జ్ బాలకృష్ణారెడ్డి మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాశమైలారంలో మల్లన్న జాతర సందడి

- భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో వేడుకలు
- తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ప్రత్యేక పూజలు



**పటాన్ చెరువు మన జనప్రగతి ఏప్రిల్ 06:–** నియోజకవర్గం పరిధిలోని పాశమైలారం గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి కల్యాణోత్సవం, మల్లన్న జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుంటూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఆలయ పరిసరాలు భక్తి శ్రద్ధలతో మార్మోగిపోతూ, పూజా కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవంలో అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు. గ్రామస్థులు మరియు నిర్వాహకులు జాతర ఏర్పాట్లు సక్రమంగా నిర్వహిస్తూ భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచాయి.

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు: కమిషనర్ ఎన్. మౌర్య



**తిరుపతి మన జనప్రగతి ఏప్రిల్ 06:–** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 36 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 5 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రవీంద్ర నగర్ నందు త్రాగునీటి పైప్ లైన్ వేశారు నీటి సరఫరా చేయాలని, యూడిఎస్ లైన్ మరమ్మత్తు చేయాలని, తాను ఇల్లు విక్రాయించలేదు అయినా వేరొకరి పేరు మీరు పన్ను వస్తోంది పరిష్కరించాలని, కొర్లగుంట మారుతీ నగర్ లో తన స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారు పరిష్కరించాలని, తాతా నగర్ వద్ద ఖాళీ జాగాలో చెత్త వేస్తున్నారు పరిష్కరించాలని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారి వ్యర్థాలను వేయడం వలన ఇబ్బందిగా ఉందని, గాలి వీధి లో అపరిశుభ్రతను పరిష్కరించాలని, ఇందిరామైదానం వద్ద చెత్త తొలగించాలని, గొల్లవాని గుంట నందు సిసి రోడ్లు, కాలువలు వేయించాలని, ఇంటికొసం డబ్బులు కట్టాము తిరిగి ఇప్పించాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి..
తెలుగు దినపత్రిక

07 -04-2026

# జలధార" కార్యక్రమంను వైఎస్ఆర్ జిల్లాలో లాంఛనంగా ప్రారంభించిన జలధార"(ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు) వందరోజుల యాక్షన్ ప్లాన్

**• జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:**-నీటి భద్రత - సాగు నీటి సంఘాల బాధ్యత పై -- సాగు నీటి పొదుపు,కొత్త ఆయకట్టు కు మదుపు కు స్మార్ట్ డ్రిప్ సాగు,వర్షపు నీటిని ఒడిసి పట్టడం,"నీటి భద్రత" మన అందరి సమిష్టి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లా లో మార్చి నెలలో సగటు భూగర్భ జలాల స్థాయి 9.15 మీటర్లుగా కలదన్నారుజిల్లాలో నీటి సంరక్షణకు గ్రామస్థాయి నుండి అవగాహన కార్యక్రమాల నిర్వహణ తో పాటు జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా ముందుకు వెళ్లాలన్నారు.జల సంరక్షణ కు ఇరిగేషన్ శాఖ ద్వారా ప్రధానం గా రెవెన్యూ,సర్వే శాఖల సహకారంతో చెరువుల ఆక్రమణ లను గుర్తించడం,వాటిని తొలగించడం, ప్రతి చెరువు చుట్టూ బౌండరీ ట్రెన్స్ ఏర్పాటు చేయడం,ప్రతి చెరువుకు గల తూముల లీకేజీ ఉన్న ఆ పనులను గుర్తించడం మొదట ప్రాధాన్యత అంశంగా చేయాలన్నారుఅర్బన్,సెమీ అర్బన్ పరిధిలో ఉన్న చెరువుల ఆక్రమణలను గుర్తించి వాటి తొలగింపునకు మున్సిపల్ కమిషనర్లు చర్యలు.జిల్లాలో మూడు ఇరిగేషన్ కెనాల్ లు కలవని,




జిఎన్ఎస్ఎస్,తెలుగు గంగ ప్రాజెక్టు,కేసీ కెనాల్ అని వీటితోపాటు తొమ్మిది రిజర్వాయర్లు,మూడు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు,పింఛా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు లతో పాటు 911 మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో 75685.18 ఎకరాలు ఆయకట్టు సాగులో కలదునీటిని ఒక చెరువు నుండి మరో చెరువుకునింపేందుకు అనుసంధానంగా గల వాగులు,వంకలు వీటి మరమ్మతులను గుర్తించు పునరుద్ధరించాలన్నారు అలాగేపంచాయతీరాజ్,ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ పరిధిలో ఉన్న చెరువులలో కూడా ఆక్రమణలను గుర్తించి వాటి తొలగింపునకు చర్యలు చేపట్టాలన్నారు ప్రతి రైతు పొలంలో పడిన వర్షపు నీటిబొట్టును కాపాడేందుకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి రైతుకు అవగాహన పెంచాలన్నారు3 ఎకరాల నుండి 5 ఎకరాలు ఉన్న రైతుల పొలంలో ఫారం పాండ్లు ఏర్పాటుకు రైతులకు అవగాహన కల్పించి వ్యవసాయ,ఉద్యాన,డ్వామా శాఖలు సమన్వయం తో పనిచేయాలన్నారుదీనితోపాటు సరిహద్దు కందకాలు ఏర్పాటుకు చిన్న,సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులపై అవగాహన పెంచాలన్నారుప్రభుత్వ, అటవీ భూముల్లో భారీ ఎత్తున ఫారం ఫాన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారుబిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ ఆర్థిక లాభం పొందేందుకు రైతులకు అవగాహనబిందు తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు సబ్సిడీతో పంపిణీ జల సంరక్షణకు గ్రామ స్థాయి నుండి మండల జిల్లా స్థాయి వరకు ఏర్పాటైన కమిటీలు ఈ అంశం నకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి జల సంరక్షణ చేపట్టడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదల అంశంపై వాటర్ ఆడిట్ ను కూడా ప్రతి గ్రామం వారీగా అంద జేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జెసి డా.నిధి మీనా,డిఆర్ఓ మల్లికార్జునుడు, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆమరణ దీక్షను విరమింపజేసిన మున్సిపల్ కమిషనర్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి ఏప్రిల్ 06:-** ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం దగ్గర జరుగుతున్నఆమరణ దీక్షను నిర్దిష్ట హామీతో విరమింపజేసిన మునిసిపల్ కమిషనర్. కలెక్టర్,ఎమ్మెల్యే కార్మికుని తొలగింపుపై వివరణ అడిగారని, ఔట్సోర్సింగ్ కార్మికున్ని తిరిగి విధుల్లోకి తీసుకోవటానికి రిపోర్టు వెంటనే పంపిస్తామని, అధికారులు, కార్మికులు కలిసి సమన్వయంతో పనిచేయాలని తెలియజేసిన పొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ హామీతో 6 రోజుల ఆమరణ నిరహార దీక్షలు విరమించిన కార్మికులు వెంకటేశ్వర్లు,భాస్కర్ లు. అధికారుల ఆదేశాలతోనే కార్మికులు పనిచేస్తారు.మున్సిపల్ అధికారి నాగరాజు మౌఖిక ఆదేశాలతోనే వెంకటేశ్వర్లు పనిచేశారు.అధికారుల తప్పులకు కార్మికులను శిక్షిస్తే ఐక్య ఆందోళన తప్పదు. కనీస వేతన చట్టం రు.18500 పొద్దుటూరు మున్సిపాలిటీలో అమలు చేసి కోవిడ్ కార్మికులకు న్యాయం చేయాలి.మున్సిపల్ వర్కర్స్ రక్షణకై కోర్టు తీర్పులు,లేబర్ కమిషన్ ఆదేశాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని . సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

# లింగాల కుడికాలువలో అధికారుల నిర్లక్ష్యం..రైతులకు నీటి సంక్షోభం తీవ్రం.

**కాలువలో నీరు ఉన్నా చెరువులకు చేరని పరిస్థితి.**

**అడుగంటుతున్న భూగర్భ జలాలు,ఎండిపోతున్న బోర్లు.**

**పంటల భవితపై ఆందోళనలో రైతన్నలు**

**లింగాల/పులివెందుల మన జనప్రగతి ఏప్రిల్ 06:**-లింగాల మండల కుడి కాలువ పరిధిలో ఉన్న అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల పరిధిలోని గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంట పొలాల్లోని బోర్లు ఎండిపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు.గత నెల రోజులుగా సీబీఆర్ డ్యాం నుంచి కుడి కాలువకు సమృద్ధిగా నీరు విడుదలవుతున్నప్పటికీ, ఆ నీటిని సమర్థవంతంగా వినియోగించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. తాతిరెడ్డిపల్లి బియాండ్ ఎత్తిపోతల పథకం సహా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల, వేముల, వేంపల్లి ప్రాంతాల్లోని సుమారు 15కు పైగా పథకాలు ఈ కాలువపై ఆధారపడి ఉన్నాయి. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి




చేపట్టిన ఈ పథకాల ద్వారా చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయని భావించినప్పటికీ,ప్రస్తుతం ఆ లక్ష్యం నెరవేరడం లేదు.**అడుగంటుతున్న భూగర్భ జలాలు..** ఎండల తీవ్రత పెరగడంతో గత పది రోజులుగా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయి.ఎత్తిపోతల పథకాల కింద ఉన్న చెరువులు ఎండిపోయి ఒట్టి కుండలుగా మారాయి. దీంతో త్రాగునీరు, సాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **బాధ్యతారాహిత్యంపై రైతుల ఆగ్రహం..**కాలువలో నీరు ప్రవహిస్తున్నప్పటికీ ముందస్తు ప్రణాళికలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు మండిపడుతున్నారు.గత డిసెంబర్లోనే మోటార్లను సక్రమంగా నిర్వహించి చెరువుల్లో నీరు నిల్వ చేసి ఉంటే ప్రస్తుత సంక్షోభం రాకపోయేదని వారు



అంటున్నారు.ఇప్పుడు మాత్రం కాలిపోయిన మోటార్ల మరమ్మతుల పేరిట అధికారులు ఆలస్యంగా స్పందిస్తున్నారని విమర్శిస్తున్నారు.**పట్టించుకోని పాలకులు.** వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగు నీరు,సాగునీటి సమస్యలపై ముందస్తు సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సిన పాలకులు ఇప్పటివరకు స్పందించకపోవడం విమర్శలకు దారి తీసింది. అధికారుల నిర్లక్ష్యానికి పాలకుల బాధ్యతారాహిత్యమే కారణమని గృహిణులు అభిప్రాయపడుతున్నారు.ఇప్పటికైనా పులివెందులలోని లింగాల కుడి కాలువ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని రైతులు,మహిళలు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

## బంటుపల్లి ఆంజనేయస్వామి తిరుణాల సందర్బంగా రాష్ట్ర స్థాయి బండల లాగుడు పోటీలు.

**దేవనకొండ మన జనప్రగతి ఏప్రిల్ 06:**-దేవనకొండ మండలం బంటుపల్లి గ్రామం లో బంటుపల్లి ఆంజనేయస్వామి తిరుణాల సందర్బంగా తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకుడు వెంకట స్వామి గౌడ్,దేవనకొండ సీఐ.వేణుగోపాల్ రావు ధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించడం ఈ కార్యక్రమం దేవనకొండ మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,బండి గింజల రంగన్న,ఈదుల దేవర బండా సుభాన్,ఆకుల వీరేష్,కప్పట్రాళ్ల మల్లికార్జున పరమేష్ గౌడ్,శ్రీరాములుగౌడ్,మహేష్ రెడ్డి.ఐటీడీపి రామాంజి,నాగ భూషణం,మరియు బంటుపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,గ్రామ ప్రజలు మరియు పోలీసు సిబ్బబంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ ఫిలిం మోజు.. పెన్నా నదిలో విషాదం.



**పుష్పగిరిలోని సుడిగుండాల బారిన ముగ్గురు యువకులు**

**ఆదివారం విషాద ఘటన - స్థానికులను కలచివేసింది.**

**జాగ్రత్తలు పాటించాలి అంటున్నా ఎస్ఐ శివనాగిరెడ్డి.**

**చెన్నూరు మనజనప్రగతి ఏప్రిల్ 06:**-వల్లూరు మండల పరిధిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పుష్పగిరి వద్ద ఆదివారం జరిగిన విషాద ఘటన స్థానికులను కలచివేసింది.సరదాగా షార్ట్ ఫిలిం చిత్రీకరణకు వచ్చిన యువకుల బృందంలో ముగ్గురు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది..అయితే ఈ ఘటనలో పోలీసులు ప్రదర్శించిన అప్రమత్తత, సేవా భావం, ప్రాణరక్షణ కోసం చేసిన చివరి వరకూ పోరాటం ప్రశంసలు అందుకుంటోంది.కడప నగరానికి చెందిన సుమారు ఎనిమిది మంది యువకులు ఫ్రంట్ లైన్ ప్రెస్' పేరుతో షార్ట్ ఫిలిం చిత్రీకరణ కోసం పుష్పగిరి సమీపానికి చేరుకున్నారు,ఉదయం షూటింగ్ పూర్తిచేసుకున్న అనంతరం మధ్యాహ్నం భోజనం కోసం సమీపెన్నా నది వద్దకు వెళ్లిన వారు, అనంతరం అక్కడ ముగ్గురు యువకులు సరదాగా నీటిలోకి దిగారు..అయితే నదిలో ప్రవాహం ఉధృతంగా ఉండటం, లోతు అంచనా వేయలేకపోవడంతో వారు




సుడిగుండాల్లో చిక్కుకుని మునిగిపోయారు. స్నేహితులు వెంటనే సమాచారం ఇవ్వడంతో వల్లూరు ఎస్ఐ శివనాగిరెడ్డి తన సిబ్బందితో అత్యవసరంగా ఘటనాస్థలికి చేరుకున్నారు..ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో మొదట ఒక యువకుడిని బయటకు తీయగా, పల్స్ చూస్తూ 45 నిమిషాల్లోనే బయటికి తీయడంతో అతని జాతిపై నొక్కుతూ ఎస్ఐ శివనాగిరెడ్డి స్వయంగా సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందించడం ప్రాణాలు కాపాడాలని తన కృషి అందర్నీ ఆకట్టుకుంది.తదుపరి శోధనలో మరో యువకుడి మృతదేహాన్ని వెలికితీశారు, మూడో యువకుడి కోసం గాలింపు ఆదివారం అర్ధరాత్రి కొనసాగింది,మృతుల్లో కడపకు చెందిన హరిబాబు (23),హర్షవర్ధన్ (22)గా గుర్తించగా, కృష్ణ చైతన్య (20) కోసం శోధన కొనసాగుతోంది.వీరిలో ఇద్దరు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కాగా, ఒకరు ప్రైవేట్ హోమియోపతి ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గల్లంతయిన కృష్ణ చైతన్య 20 మృతదేహాన్ని సోమవారం ఉదయం గజ ఇతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం బయటపడింది.పెన్నా నదిలో గల్లంతైన ముగ్గురు మృతదేహాలను కడప రిమ్స్ కు తరలించారు.ఘటన స్థలాన్ని కమలాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్ఐ శివనాగిరెడ్డి మాట్లాడుతూ పుష్పగిరి,ఆదినిమాయపల్లి ఆనకట్ట ప్రాంతాలు అత్యంత ప్రమాదకరమని, వీటిని పర్యాటక ప్రదేశాలుగా భావించి నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.సరదా కోసం నదిలోకి దిగడం ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని,క్షణికావేశంలో చేసే తప్పిదాలు కుటుంబాలకు శాశ్వత విషాదాన్ని మిగులుస్తాయని ఆయన సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇక్కడికి సరదా కోసం వచ్చి మృత్యువాత పడవద్దని విలేకరుల ద్వారా ప్రజలకు ముఖ్యంగా యువతకు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన

**పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 06:**-స్థానిక ప్రభుత్వాలైన మున్సిపల్ కార్పొరేషన్ లకు,మున్సిపాలిటీలకు, నగర పంచాయతీలకు, గ్రామపంచాయతీలకు, మండల పరిషత్లకు, జిల్లా పరిషత్తులకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం చట్టవిరుద్ధం, రాజ్యాంగం ఉల్లంఘన అవుతుందని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 78 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు ఉన్నాయని చెప్పారు. 11 మున్సిపల్ కార్పొరేషన్ లకు,75 మున్సిపాలిటీలకు నగర పంచాయతీలకు గత మార్చి నెల 17వ తేదీతో పాలక మండలి కాల పరిమితి అయి పోవడంతో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. 74వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం కాలపరిమితి అయ్యే లోపు ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మీద ఉందన్నారు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని



అన్నారు. రాష్ట్రంలో 13324 గ్రామపంచాయతీలో ఉన్నాయాని వాటి కాలపరిమితి ఈనెల ఏప్రిల్ 2వ తేదీతో పూర్తి అయ్యిందని చెప్పారు. మండల పరిషత్ లకు సెప్టెంబర్ 24న కాల పరిమితి ముగిసే లోపు ఎన్నికలు నిర్వహించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు. మొక్కజొన్న, బుడగ శనిగ పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా రబీ సీజన్ లో 12,07,500 ఎకరాలలో రైతులు మొక్కజొన్న పంట వేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాళ్లు రూ 2,400 చొప్పున కనీసం మద్దతు ధర ప్రకటించడమే తప్పా కొనుగోలు కేంద్రాలు తెరవలేదు అన్నారు. ఒక్కొక్క క్వింటాళ్ల మీద రైతులు రూ 900 నష్ట పోతున్నట్లు చెప్పారు. మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరవాలని కోరారు. బుడ్డ శనిగ కేవలం 84 వేలు టన్నుల మాత్రమే కొనడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం శోచనీయం అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లె మండల కన్వీనర్ రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేష్ నామా వినయ్, ఐచర్ రమణ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు, బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

**ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ కఠిన హెచ్చరిక**

**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 06:-** సిద్ధవటం,అట్లూరు, ఒంటిమిట్ట మండలాల్లో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించినా లేదా గంజాయి వంటి మాదక ద్రవ్యాలను విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ స్పష్టం చేశారు. సిద్ధవటం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన కీలక అంశాలు మూడు మండలాల్లో ఇప్పటివరకు నిబంధనలు అతిక్రమించిన 118 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి సాగు లేదా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై రాత్రి వేళల్లో వివిధ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.



# పీజీఆర్ఎస్‌కు 396 అర్జీలు..ప్రత్యేక దృష్టితో పరిష్కారం: జేసీ అపూర్వ భరత్



**కాకినాడ మన జనప్రగతి ఏప్రిల్ 06:**–జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రత్యేక దృష్టితో పరిశీలించి వేగంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించిన పీజీఆర్ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 396 అర్జీలు స్వీకరించారు. బియ్యం కార్డుల మంజూరు, పేర్ల మార్పులు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్యం వంటి అంశాలపై వినతులు ఎక్కువగా వచ్చాయి.అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై సత్వరంగా మరియు సమగ్రంగా విచారణ జరిపి పరిష్కారం అందించాలని జేసీ సూచించారు. రీ–ఓపెన్ చేసిన అర్జీలను కూడా క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు సంతృప్తికర సమాధానాలు ఇవ్వాలని ఆదేశించారు. శాఖల వారీగా పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసు, డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.**రెవెన్యూ క్లినిక్‌లో 10 అర్జీలు.** రెవెన్యూ శాఖ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో మొత్తం 10 అర్జీలు అందాయి. రీ సర్వే, భూముల ఆన్‌లైన్ నమోదు, 22ఏ భూములు, సర్వే నెంబర్లకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా వచ్చాయి.ఈ సందర్భంగా డీఆర్వో తిప్పే నాయక్ రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించి అర్జీలను గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మాధవరం చేనేత క్లస్టర్‌లో ఏంజరుగుతోంది..?

- రెండేళ్లుగా అందని ఉపాధి..అధికారులకు కార్మికుల ఫిర్యాదు






**మన జనప్రగతి, 06 సిద్దవటం:** మాధవరం చేనేత క్లస్టర్ భవనం నిరుపయోగంగా మారిందని, స్థానిక కార్మికులకు ఎటువంటి శిక్షణ కానీ, ఉపాధి కానీ లభించడం లేదని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప కలెక్టరు కార్యాలయంలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో జిల్లా కోపరేటివ్ అధికారి వెంకటసుబ్బయ్యతో పాటు చేనేత జౌళి శాఖ అధికారులకు కార్మిక నాయకులు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన క్లస్టర్ భవనాన్ని, ఇటీవల మరో 50 లక్షల ప్రజాధనంతో ఆధునీకరించి స్థానికేతరులకు లీజుకు ఇచ్చారు. అయితే రెండేళ్లు గడుస్తున్నా అక్కడ ఎటువంటి ఉత్పత్తి ప్రారంభం కాలేదు. లీజుదారుడు స్థానిక కార్మికులకు శిక్షణ ఇవ్వకపోగా, అసలు భవనం లోపలికి ఎవరినీ అనుమతించడం లేదని కార్మిక సంఘం నేతలు గంజి సుబ్బరాయుడు, శ్రీరాందాసు వెంకట్ ఆరోపించారు. లోపల ఏం జరుగుతుందో అటు ప్రజలకు, ఇటు అధికారులకు తెలియని పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. వెంటనే అధికారులు విచారణ జరిపి, ఈ క్లస్టర్ ద్వారా స్థానిక చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని లేదా సమర్థులైన స్థానికులకు దీని నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, చేనేత నాయకులు మునగపాటి సుబ్బరాయుడు, శ్రీరాందాసు ఆంజనేయులు, సామల చెంగయ్య, చేపూరి లక్ష్మి నరసయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం చేనేత జౌళి శాఖ ఏడిఓ లు శేషగిరిరావు, రవి ప్రకాష్ రెడ్డి లు మాధవరం చేనేత క్లస్టర్ భవనం చేరుకుని చేనేత నాయకులు, కార్మికుల సమక్షంలో లీజుదారున్ని విచారించి వివరాలు సేకరించారు తదుపరి నివేదిక వున్నతాధికారులకు చేరుస్తామని తెలిపారు.

# పెన్నా నదిలో ఇసుక మాఫియా బీభత్సం

**అధికారులు చర్యలు తీసుకోవాలి,రైతుల ఆవేదన**



**సిద్ధవటం మన జనప్రగతి ఏప్రిల్ 06:**–పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది.ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కిఇసుక కేటుగాళ్లు రాత్రి వేళల్లో యంత్రాలతో ఇసుకను తరలిస్తూ బరితెగిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని లింగంపల్లి, కడపాయపల్లె, మాచుపల్లి గ్రామాల్లోని పంట పొలాల సమీపంలో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒక్కో ట్రాక్టర్ ఇసుకను కడపకు తరలించి రూ. 3 వేలకు విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అక్రమ రవాణాపై మండల తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు స్పందిస్తూ.. ఇసుక తరలింపు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే లింగంపల్లి, మాచుపల్లి ప్రాంతాల్లో రవాణాకు వీలు లేకుండా రహదారులను తొలగించామని, అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# ఎలైట్ ప్రివిలేజ్ కార్డు ఆవిష్కరణ



**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:**–జేఎస్ బ్రదర్స్‌సంస్థ తీసుకొచ్చిన ఎలైట్ ప్రివిలేజ్ కార్డ్ ను వారం కస్టమర్ల చే ప్రారంభించారు. ఎలైట్ ప్రివిలేజ్ కార్డు ప్రజలు కొనుగోలు చేసి అనేక ప్రయోజనాలు పొందాలని సంస్థ నిర్వాహకులు ప్రజలను కోరారు.కడప నగరంలోని జేఎస్ బ్రదర్స్ గోల్డ్ సంస్థలో కేవలం 999 రూపాయలతో కొనుగోలు చేసిన ఎలైట్ ప్రివిలేజ్ కార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలైట్ ప్రివిలేజ్ కార్డ్‌తో మా వద్ద ఉన్న జర్మన్ టెక్నాలజీ ఎక్స్‌ఆర్ఎఫ్ మిషీన్ల ద్వారా కస్టమర్లు తమ బంగారు నాణ్యతను ఉచితంగా పరీక్షించుకోవడంతోపాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.అలాగే ఎవరైనా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోవాలి అనుకుంటే మా సర్వీస్ ఛార్జీలపై 20శాతం డిస్కౌంట్ అందిస్తామని, పాత బంగారం విక్రయించే సమయంలో, మార్కెట్ రేటు కంటే అదనంగా గ్రాముకు 50 రూపాయల వరకు ఎక్కువ నగదును కస్టమర్లకు అందిస్తున్నామని,ఈ కార్డ్ తీసుకున్న వారికోసం మేము నిర్వహించే లక్కీ డ్రాలో 30 గ్రాముల బంగారం మొదటి బహుమతిగా, బుల్లెట్ బైక్ రెండవ బహుమతిగా, 10 గ్రాముల బంగారం 3 నుంచి 5వ బహుమతిగా, అర కిలో వెండి 6, 7 బహుమతులుగా, 5 గ్రాము బంగారం,8 నుంచి 10వ బహుమతిగా అందిస్తామన్నారు. ఏప్రిల్ 6 నుంచి జూలై 6 వరకు మా '90 డేస్ ఛాలెంజ్' నడుస్తుంది. ఈ మూడు నెలల కాలంలో కార్డ్ తీసుకున్న వారికి పైన చెప్పిన ఆఫర్లతో పాటు మరిన్ని ప్రత్యేక ప్రయోజనాలు అందుతాయన్నారు.అంతేకాకుండా బంగారం అమ్మకంలో మరియు సర్వీసింగ్‌లో ఒక కొత్త అనుభూతిని అందించడానికి జె.ఎస్. బ్రదర్స్ గోల్డ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనేక ప్రయోజనాలుగల ఈ కార్డులను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది,కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# అక్షరాల వ్యభిచారం మానుకో..

**ఏబీఎన్ రాధాకృష్ణపై రాచమల్లు ఘాటు విమర్శలు.**

**భార్యాభర్తల పవిత్ర బంధాన్ని బజారుకు ఈడ్చారని ఆరోపణ.**

**మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించారని మండిపాటు.**

**పచ్చ మీడియా మారకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరిక.**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 06:**–ఏబీఎన్ రాధాకృష్ణపై రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భార్యాభర్తల పవిత్ర బంధాన్ని బజారుకు ఈడ్చుతూ అక్షర వ్యభిచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సోమవారం దొరసానిపల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనది. కష్టసుఖాల్లో చివరికి మిగిలేది ఈ అనుబంధమే. అలాంటి బంధాన్ని అవమానించడం మేధస్సుకు పట్టిన దరిద్రం" అని వ్యాఖ్యానించారు.ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదని, రాష్ట్రంలోని మహిళలందరి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని రాచమల్లు పేర్కొన్నారు. మానసిక దౌర్భాగ్యంతో స్త్రీల గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించారని మండిపడ్డారు.ఇంకా మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం రాధాకృష్ణ అక్షర వ్యభిచారం చేస్తున్నారని ఆరోపించారు. పచ్చ మీడియా ఇప్పటికైనా మారాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.రాజధాని అంశంపై మాట్లాడుతూ, జగన్ ప్రతిపాదించిన అభివృద్ధి నమూనాను ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. తక్కువ ఖర్చుతో మచిలీపట్నం,విజయవాడ,గుంటూరు ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రాజధాని అభివృద్ధి చేయాలనే ఆలోచన మంచిదని అభిప్రాయపడ్డారు.ఈ ప్రతిపాదనపై భయపడ్డ ప్రతిపక్షం సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందని,అనంతరం మీడియాను ఉపయోగించి దారి మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.జర్నలిజం విలువలను పాటించకుండా పనిచేస్తున్న కొన్ని మీడియా సంస్థలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, ప్రజలు నిజానిజాలు గమనించాలని రాచమల్లు పిలుపునిచ్చారు.ద

# అధిక వడ్డీ బారినపడి దంపతులు బలవన్ మరణం

- నిరాశ్రయులైన పసిపిల్లలు
- సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలి సిపిఐ




**గాలివీడు మన జనప్రగతి ఏప్రిల్ 06:**– గాలివీడు మండలంలో అధిక వడ్డీ వేధింపుల కారణంగా ఒక కుటుంబం ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గాలివీడు పట్టణం శెట్టివారిపల్లెలో అధిక వడ్డీలు చెల్లించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న మారువేణి. మల్లికార్జున,రాణి దంపతుల కేసులో సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. కొందరు వడ్డీ వ్యాపారులు అమానుషంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ పేద ప్రజలను ఆర్థికంగా, మానసికంగా వేధించడం వల్ల ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనకు బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ ఘటనలో అనాథలుగా మారిన చిన్నారుల బాధ్యతను ప్రభుత్వం తీసుకుని, వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలని ఆయన అన్నారు.ఇటువంటి వడ్డీ వ్యాపారుల అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేద ప్రజలను దోచుకునే వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేనే సమాజంలో న్యాయం నెలకొంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జక్కల వెంకటేసు, ఆంజనేయులు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15 నుంచి 23 వరకు పుష్పగిరి క్షేత్రం బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ.

- ఎమ్మెల్యే చైతన్య రెడ్డి




**కడప మన జనప్రగతి ఏప్రిల్ 06:**– ఈనెల 15 నుంచి 23 వరకు పుష్పగిరి క్షేత్రం (దక్షిణ కాశీ) బ్రహ్మోత్సవాల సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి పోస్టర్ ఆవిష్కరించారు .సోమవారం వారు మాట్లాడుతూ వల్లూరు మండలం పుష్పగిరి క్షేత్రం లో శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి లా వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు జరుగునని దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాసులు లు తెలిపారు.కావున భక్తాదులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పాత్రులవుదురని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సివి శ్రీనివాస్ మూర్తి పీఎం అఖిల్ దీక్షలు, సుధాకర్ రెడ్డి, జై సుబ్బారెడ్డి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారాలకు చర్యలు**

**గ్రీన్ ఫీల్డ్ హైవే నేపథ్యంలో మదరసా రక్షణకు హామీ**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 06:**–పులివెందులలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎంపీ అవినాష్ రెడ్డి ప్రజల వినతులను స్వీకరిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. తన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు,కార్యకర్తలు అందించిన వినతులను పరిశీలించి, కొన్నింటిపై వెంటనే అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలు సూచించారు.అదేవిధంగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా మదరసాను తొలగించే ప్రయత్నాన్ని నిలిపివేయాలని ముస్లిం సోదరులు వినతిపత్రం అందజేయగా, ఎంపీ స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి మదరసా రక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను కలిసిన జనసేన నేత దాసరి రవిశంకర్

**వేంపల్లెలో మర్యాదపూర్వక భేటీ**

**ప్రాంతీయ సమస్యలు,ప్రభుత్వ సేవలపై చర్చ**

**పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని సూచన**



**వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 06:**–వేంపల్లె మండలం తహసీల్దార్ మోహన్ కృష్ణను సోమవారం జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. స్వీట్లు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీలో ప్రాంతీయ సమస్యలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై విస్తృతంగా చర్చ జరిగింది. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవ్వాలని దాసరి రవిశంకర్ సూచించారు. అలాగే ప్రజల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.తహసీల్దార్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174